# ప్రాప్తి

తాశీల్దారు రామేశం పంతులుగారు జట్కాలో నుంచి క్రిందికి దిగగానే మునసబు రాఘవరెడ్డి "నమస్కారాలు బాబూ!" అంటూ చేతులు జోడించాడు. కరణం కృష్ణశాస్త్రి తొందరగా అంగవస్త్రంతో తలపాగా చుట్టుకోవడం పూర్తిచేసి, అప్పుడే వేసుకున్న తాంబూలాన్ని ఒక గ్రుక్కలో మ్రింగి చేతులు కట్టుకుని వినమ్రుడై నిల్చున్నాడు.

"చావడిలో నీళ్ళు కాగుతున్నాయండీ! భోజనానికి కూడా ఏర్పాట్లు చేశాం. తమరు స్నానంగానిచ్చేసరికి అవతల భోజనం సిద్ధమైపోతుంది" అన్నాడు మునసబు.

తాశీల్దారు చావడిలో ప్రవేశిస్తూ "స్నానపానాలకు వేళేం మించిపోలేదు లేవోయ్! మొదట ఆ తగరాదేదో దాన్ని కొంచెం పట్టి చూద్దాం. ఎక్కడ! ఆ ఆసాములిద్దరూ వున్నారా" అంటూ ఈజీచేర్ పైన శేషాహిమీద విష్ణుదేవుడిలా పవ్వళించాడు.

"పిలవమంటారండీ! ఎంతసేపు! వినగానే పురకలేస్తూ రారూ" అంటూ మునసబు వాకిట్లోకి వెళ్ళి "ఒరే రామిగా! పరుగున వెళ్ళి నడిమింటి రామానాయుణ్ణి, పందిరి మల్లయ్యనీ కేకేసుకురా. ఇక్కడున్నట్టు రావాలి" అని తలారి వాడికి ఆనతిచ్చాడు.

"వాళ్లు వచ్చేలోపుగా ఆ వ్యవహారమేమిటలో కాస్త చెప్పవయ్యా వింటాను. పాడువిలేజి పాలిటిక్సు! తల దిమ్మెక్కిపోతోంది" అన్నారు తాశీల్దారుగారు.

"ఇదేమంత గొప్ప విషయమండీ! మీరొక గీత వ్రాశారంటే మళ్లీ దానికి ఎదురుంటుందేమన్నానా! ఆ చింతలేటి దాపున రామానాయుడి టెంకాయతోపు ప్రక్కన వుందండీ ఆ బీటినేల. నాలుగెకరాల యాభై సెంట్లు అని లెక్క. కొంచెం ఎక్కువగానే ఉండొచ్చు. ఆ పొలానికి పడమరగా మల్లయ్య పుంజ భూములున్నాయండీ! మొన్ననే బావి త్రవ్వించి మిషనుపెట్టాడా, ఆ భూమి కూడా కాస్త కలిసి వస్తే సేద్యానికి అనువుగా వుంటుందనుకున్నాడు మల్లయ్య. మరి రామానాయుడేమో ఆ పొలాన్ని తనతోటలో కలిపేసుకుంటే బాగుండు ననుకొంటున్నాడు."

"వాళ్ళనుకోడంలో ఏముంది లేవోయి! మునసబుగారు అనుకోవాలి గదా!" అంటూ తాశీల్దారుగారు మెల్లగా నవ్వారు.

"అబ్బెబ్బే! దేవుడుతోడండీ! నాకా రంపులూ, రచ్చలూ బొత్తిగా గిట్టవుబాబూ! తమరెవరికి పట్టా యిప్పించినా నా కిష్టమే" అన్నాడు మునసబు.

"మనలో మన మాటనుకోవయ్యా! ఎలాగైనా ఈ వూరి వాడివి కదా! మంచీ చెడ్డా నీలా నాకు తెలుస్తుంది గనకనా!" అంటూ తాశీల్దారుగారు మునసబును మెల్లగా బుజ్జగించారు.

"ఆలోచించి చూస్తే మల్లయ్యదే న్యాయంగా కనబడుతుందండీ! సముద్రంలాంటి బావి త్రవ్వించాడా! అప్పు చేసి మిషను పెట్టించుకున్నాడా! పైగా ఆ పొలాన్ని తోటకు గీటకు కాకుండా మొదటిరకం పుంజనేలగా వినియోగించుకో బోతున్నాడాయె! అందువల్ల...." అంటూ మునసబు గుణిశాడు.

"అంతా బాగానే వుంది కానీ మొన్న రామానాయుడు వ్రాసిన అర్జీపైన రెవిన్యూ ఇన్స్పెక్టరు వ్రాసిన సిఫార్సు బలంగా వుందే మరి! దానికేమంటావు" అన్నారు తాశీల్దారుగారు.

"దానికా అంటే! మరి....మరి"

"చెప్పవయ్యా! ఫరవాలేదు."

"ఇటుచూస్తే నుయ్యి! అటుచూస్తే గొయ్యి! ఏం చెప్పమంటారు బాబూ! రెవిన్యూ ఇన్‌స్పెక్టరుగారి పైన పితూరీలు చెబుతున్నాననుకోగూడదండీ! ఆయనకూ, కరణం గారికీ ఏదో దూరపుబంధుత్వం వుందట! వాళ్ళే చెప్పుకోగా విన్నాను. నాకేం తెలుసు. మరి కరణంగారేమో రామానాయుడు వైపు"

"సరేసరే! ఇప్పుడు తెలిసింది. నువ్వేమో మల్లయ్యవైపు. మీ మధ్యలో మేము ఏం చేయడానికీ తోచక సతమతమై చావాలి! బాగుందయ్యా బాగుంది. అయ్యా రాఘవరెడ్డి! బాగుంది" అంటూ తాశీల్దారుగారు చిరాకు వ్యక్తిపరచారు.

"లేదండీ బాబూ! ఈ వ్యవహారంలో నేను తటస్థుణ్ణి. నాకేం తెలియదు" అని మునసబు తనను తనే సమర్థించుకోబోయాడు.

"నువ్వలాగనకుండా నేను మల్లయ్య వైపని నిక్కచ్చిగా చెప్పుకుంటావా మనసబూ! లోకజ్ఞుడివి. వ్యవహారజ్ఞుడివి. అనువుగా మాట్లాడ్డం నీకు తెలియని విద్య గనుకనా! ఆహాఁ మాటవరుసకన్నాను. ఏమంటావు" అంటూ తాశీల్దారుగారు మునసబు ముంగాళ్లకు బంధంవేసి పరుగెత్తవయ్యా పరుగెత్తు అన్నాడు.

మునసబు నిరుత్తరుడై పైకిచూస్తూ పైకప్పు వాసాలు లెక్కించుకొనసాగాడు!

"పోనీలే! నువ్వు భోజనమైందేమో చూడు. ఆలోపల నా పని కొంచెం వుంది. అన్నట్టు అక్కడ కరణం వుంటే లోపలికి రమ్మను" అంటూ తాశీల్దారుగారు జేబులో చేయివేశారు.

ఏముంది జేబులో? సర్వశూన్యంగా వుందది!

కంగారుగా పైకిలేచి తాశీల్దారుగారు "ఒరే చక్రీ చక్రీ!" అంటూ జవానును పిలిచారు.

"ఏం బాబూ! ఏంకావాలి" అంటూ జవాను లోపలికి వచ్చాడు.

" నా పొడుం డబ్బీ ఏదీ"

"బయల్దేరినప్పుడు తమ చేతికిచ్చానుగదండీ! మళ్ళీ బస్సులో కూడా ఒకటి రెండుసార్లు వేసుకుంటుండగా చూచాను."

"జట్కాలోకూచున్న తర్వాత గూడా అది నాచేతిలోనే వుంది. ఇప్పుడు చూచుకుంటే లేదే! ఏమైనట్టు?"

"జట్కాలో పడిపోయిందేమోనండీ!"

"పరుగెత్తు మరి! ఆ జట్కావాణ్ణి అడుగు."

జవాను హుటాహుటిగా పరుగెత్తడానికి వుపక్రమిస్తున్నాడేమో, ద్వారం దగ్గర లోపలికి వస్తున్న కరణం గారికి ఢీకొని ఆ తొందరలో అతన్ని గట్టిగా అబ్బళించుకున్నాడు. "ఏమిటీ, ఏమిటీ! ఏం జరిగింది! " అంటూ కరణం కృష్ణశాస్త్రి బిత్తరపోయాడు.

"మరేం కొంప మునగలేదు గానీ, నువ్వా చక్రిగాడి గాఢాలింగనం నుంచి బయటపడి యిక్కడికి రావయ్య కృష్ణశాస్త్రీ" అన్నారు తాశీల్దారు గారు.

"వస్తున్నాను బాబయ్యా! సెలవివ్వండి" అంటూ కరణం దగ్గరికి వచ్చాడు.

"ఆఁ ఏం లేదు. ఆ రామానాయుడు ఎంతమాత్రం ముట్టజెబుతానన్నాడేమిటి?"

"ఎవరికండీ?" కరణం బోలెడు అమాయకత్వాన్ని వున్నట్టుండి ఒలకబోశాడు.

" ఆ సంగతలా వుండనీ! ఈ వూళ్ళో నశ్యం దొరుకుతుంది గదూ?"

"నశ్యమాండీ! అది...." కరణం ఆలోచించసాగేడు.

"అదేనయ్యా! ఒకమాటలో చెప్పగూడదూ! ఐనా ఘటికుడివయ్యా శాస్త్రుల్లూ! ఉందంటే తెమ్మంటాడేమో! లేదంటే కోప్పడ్తాడేమో! అదేగదా నీ ఆలోచన."

"కాదు కాదండీ! ఈ పూరి సంగతి మీకు తెలియంది కాదుగా! ఇది యాభై ఏడో దేశమండీ బాబూ! ఏ వస్తువు కావలసి వచ్చినా ఆ చిగురువాడే మాకు శరణ్యం. అదీ శుక్రవారమైతేనే! మిగిలిన రోజుల్లో అవూరూ దీనికి నకలే!"

"ఏమిటది! కాస్తా అర్థమయ్యేట్లు చెప్పగూడదూ! శుక్రవారాలు తప్ప మిగిలిన రోజుల్లో ఈ ప్రాంతమంతటా తడిగుడ్డ కడుపుపైన పరచుకొని ఒక్క ప్రొద్దులుంటారేమిటి?"

"శుక్రవారం సంతకదండీ! అన్ని వస్తువులూ దొరుకుతాయి"

"బాగుందయ్యా బాగుంది" అంటూ తాశీల్దారుగారు బొటనవ్రేలిని చూపుడి వ్రేలితో చేర్చి చిటికెబెట్టి ముక్కుదాకా తీసుకెళ్లారు. కానీ వ్రేళ్ళమధ్య పొడుముంటే గదా అది ముకుపుటాల్లో దూరి మెదడుకు నూతనోత్తేజం కలిగించడానికి! తీరా అందులో నశ్యం లేదన్న సంగతి తెలిసిన తర్వాత తాశీల్దారు గారు చేయి క్రిందపడేసి తలనొక ప్రక్కగా వాల్చి "అయ్యా! శాస్త్రీ! పో. నా ఎదుటుండకు" అని గద్దించారు.

అకారణమైన ఈ ఆగ్రహాన్ని చూసి కరణం నిలువునా నీరైపోతూ మెల్లమెల్లగా బయటికి జారుకున్నాడు.

అదునుకోసం హజారం దగ్గర పొంచివున్న రామానాయుడు కరణం బయటకి రాగానే "ఏమయ్యా శాస్త్రులూ ఎలా వుంది ధోరణి" అంటూ ఆచూకీ తీయబోయాడు.

"నూరే భరించడానికి వీల్లేకుండా వుందయ్యా బాబూ! ఇక త్రాగేం భరించేవు! వెళ్లు వెళ్లు. ప్రొద్దు వాటారినాకైనా మనిషి చల్లబడతాడేమో చూద్దాం" అంటూ కరణంగారు బెంచీపైన కూలబడ్డాడు.

*   *   *

మిట్టమధ్యాహ్నాం. భరణి కార్తేమో, బండలు పగిలి పోయేట్టు ఎండ మండిపోతుంది. తిన్న శాస్త్రం ముగించుకుని పెద్దలూ, పడుచువాళ్ళూ, రావిచెట్టు క్రింద రచ్చపైన సమావేశమయ్యారు. తాశీల్దారుగారి రాకను గురించి, ఆయన గుణగుణాలను గురించి వూహాగానాలు సాగుతుండగా కిర్రు చెప్పులతోనూ, పెద్ద తలగుడ్డ క్రింద మెరసిపోతున్న పంగనామాలతోనూ, పందిరి మల్లయ్య రంగంలో ప్రత్యక్షమయ్యాడు.

"వేళకానివేళ మల్లయ్యా! కూచో వెళ్దువుగానీ! తినీ గినీ బొజ్జ నిమురుకుని కూచుంటున్నప్పుడు అధికారుల దర్శనం చేసుకోవాలి. కార్యం సానుకూలం కావాలి కదా మనకు!" అంటూ ఒక వృద్ధుడు మల్లయ్యను రచ్చపైన కూచోబెట్టాడు.

"అదిగో అదిగో! ఐనా అసాధ్యుడయ్యా రామానాయుడు! అప్పుడే చావిడికి హాజరై వస్తున్నాడే" అంటూ ఒక ఆసామి పడుకున్నవాడు లేచి కూచున్నాడు.

రచ్చపైన మలయ్యను చూడగానే రామానాయుడు చేయి మీసాలపైకి పోయింది. బుర్రలో ఒక ఆలోచన మెరిసింది. లేని నవ్వు పెదవిపైకి తెచ్చుకుంటూ మీసం మెలివేసుకుంటూ అతడు రచ్చను సమీపించాడు.

"ఏమోయి రామానాయుడూ! ఎలా వున్నారు తాశీల్దారుగారు" అని ఒకరు పలకరించారు.

" ఈ రావిచెట్టుకింద నిల్చుని చెప్పుకోవాలిరా భీమన్నా! ఏం శాంతం! ఏం శాంతం! ధర్మరాజురా తండ్రీ ధర్మరాజు! వెళ్ళానా! కూచోమన్నాడు! పేరూ గీరూ విచారించాడు. విషయం చెబుదామనుకున్నాను. చెప్పనిస్తేగా! ఏముంది రామానాయుడూ! పేరుకు ఉ ద్యోగం పెద్దదేగానీ, ఈ బాందరబందీ చెప్పతరమా! పై వాళ్ళకు జవాబు చెప్పుకోవాలి! క్రిందివాళ్ల పనిమీద అజమాయిషీ చేసుకోవాలి! అప్పుడప్పుడూ ఇలా పల్లెటూళ్ళపైనపడాలి! అబ్బబ్బ! ఏం గొడవలోలే! మతి పోతుందనుకో అంటూ ఏదేదో ఏకరువు పెడుతూ కూచున్నాడు. మళ్ళీ వస్తాను బాబూ అని సెలవు తీసుకొనే సరికి యింతసేపైయింది." అంటూ రామానాయుడు ఓరకంటితో మల్లయ్య వైపోసారి చూచి మెల్లగా వీథంట ముందుకు సాగాడు.

రామానాయుడు రంగంనుండి నిష్క్రమించగానే మల్లయ్య రచ్చపైనుంచి క్రిందికి దిగి చావడివైపు వడివడిగా నడవసాగాడు.

* * *

తాశీల్దారు గారికి నిజంగానే మతిపోతోంది. ఐదు నిమిషాల వ్యవధిలో నాలుగైదుసార్లు అప్రయత్నంగా ఆయన చేయి జేబులోకి వెళ్ళి వెళ్లింది వెళ్ళినట్టుగానే బయటకు వచ్చింది. పొడుం డబ్బీ చేతిలో ఉండగానైతే ఆయన కొంతసేపు పొడుం వేయకుండా కాలం గడవగలడు. కానీ అది చేతలేకపోతే మాత్రం ఐదు నిమిషాల కొకసారి పొడివేయబుద్ధవుతుంది. వేయకపోతే పని చేయడానికి మనస్కరించదు. దిక్కులు తోచదు. అంతెందుకూ! అన్నం సహించదు. నిద్రపట్టదు!

ఈజీ చేర్‌లోంచి తాశీల్దారుగారు అటూ ఇటూ పచార్లు చేయసాగారు. తనను లోపల దిగవిడిచి గైర్ హాజరైన మునసబు, కరణాలపైన ఆయనకు ఒల్లమాలినంత ఆగ్రహం కలిగింది. జట్కావాడిని వెతుక్కుంటూ పోయిన జవాను కూడా యింతవరకూ పత్తాలేదు. "రానీ, రానీ! వీళ్ళ పనిచెబుతాను" అనుకున్నాను తాశీల్దారు గారు.

"దండాలండీ బాబయ్యా!"

"ఎవరూ!" అంటూ తాశీల్దారుగారు వచ్చిన మనిషివైపు విచిత్రంగా చూచారు.

"నాపేరు మల్లయ్యంటారండీ! తమరొచ్చారని వినగానే రెక్కలు గట్టుకొని పరుగెత్తొస్తున్నాను."

"చాలా శ్రమపడ్డావే పాపం! ఏం కాస్త నెమ్మదిగా నడిచే రాకూడదూ!"

"ధర్మదొరలు! న్యాయం తమకు తెలీందేమీ కాదు. నా విన్నపం చిత్తగించాలి" అని మల్లయ్య అంతకుముందే తను వూహించుకున్న ప్రకారం మాటలు ఒప్పగించాడు.

"ఏమిటయ్యా నీ న్యాయం! ఏదీ! చెప్పు చూద్దాం" అంటూ తాశీల్దారుగారు మళ్ళీ ఈజీచేర్‌లో కూచున్నారు.

మల్లయ్య నివ్వెరపోయాడు. రామానాయుడు వర్ణనకీ, తాశీల్దారుగారి నిజ స్వరూపానికీ ఎక్కడా పొత్తు కుదరడంలేదు. అయినా అతడు కాస్త తెప్పరిల్లుకుని "అది కాదండీ బాబయ్యా! ఆ భూమి నా ఆయకట్టుకు దగ్గరగా వుంది. కయ్యిలో కయ్యి. గవర్మెంటు లోను తీసి కొత్త బావి త్రవ్వించాను. మిషను కూడా పెట్టించాను. అంతే బాబూ! ఆపైన తమ దయ!" అన్నాడు.

" ఆ బావి కింద నీకిప్పుడెంత పొలం వుంది?" అన్నారు తాశీల్దారు గారు.
"ఆరెకరాలకు పైచిలుకేనండీ?" అంటూ వ్యవహారం తనకు సుముఖ మవుతోందని లోలోపలే సంబరపడ్డాడు మల్లయ్య.
"ఐతే ఆ ఆరెకరాలూ చాలక ఈ అయిదెకరాలు కూడా నీ మడితో కలుపుకోదలుచుకున్నా వన్నామాట! అంతే గదూ?"
అది నిగ్రహమో, అనుగ్రహమో తెలియక మల్లయ్య నిరుత్తరుడై నిల్చున్నాడు.
"మా బాగా చెప్పావులే! ఉన్నవాడికే మరింత దోచిపెట్టడం కాదు న్యాయమంటే. న్యాయ పరిష్కారం ఎలా చెయ్యాలో మాకూ కొంత తెలుసు. వెళ్ళు. వెళ్ళు."
"మరి ఆ రామానాయుడు మాత్రం బొత్తిగా లేనివాడటండీ!" అని మల్లయ్య మెల్లగా నసిగాడు.
"లేనివాడో వున్నవాడో నాకు తెలియదు. కానీ అతడు నీలా ముందు ముందుగా పరుగెత్తుకొచ్చి నాపైన విరుచుకపడలేదు" అంటూ తాశీల్దారుగారు, ముఖం మరోవైపుకు త్రిప్పుకున్నారు.
"తమరలా సెలవిస్తే నేనేం చెప్పగలను బాబయ్యా! అతడిక్కడనుంచీ వెళ్తున్నాడు. నేను తమ దర్శనం కోసం వచ్చాను."
"ఏమిటీ! ఇక్కడనుంచీ ఎవరో వెళ్తున్నారా?"
"రామానాయుడే వీధంట చెప్పుకుంటూ వెళ్తుండగా విన్నానండీ! అతడు రాగానే తమరు కూచోమని, పేరూ గీరూ విచారించారట! పైగా తమ కష్ట నిష్ఠురాల్ని సాధక బాధకాల్ని వెళ్ళబోసుకున్నారట."
తాశీల్దారుగారు నిర్ఘాంతపోయారు!
మునసబు రాఘవరెడ్డి గ్లాసులో వేడిపాలు తీసుకొని లోపలికివస్తూ అప్పుడే తాశీల్దారుగారితో బేటీ అయివున్న మల్లయ్యను చూచి ఆశ్చర్యపడుతూ, గ్లాసు టేబిలుపైన వుంచాడు.
"నువ్వు పాలు తెచ్చినంత పుణ్యమయ్యా మునసబూ! మొదట ఈయన్ను వెళ్ళిపొమ్మని చెప్పు" అన్నారు తాశీల్దారు గారు.

* * *

ఆరోజు సాయంత్రం తాశీల్దారుగారు సాగుబడి లెక్కల తనిఖీకి పొలాలపైకి బయల్దేరారు. ముందు తాశీల్దారుగారు వెనుక మునసబు, కరణం, తోటివాళ్ళు, తలారులూ ప్రొద్దుగూకేంతవరకూ పొలాల్లో చెడతిరిగారు. త్రోవపొడుగునా కరణం గారైతే పొలాల్ని చూపిస్తూ సాగుబడి వివరిస్తూ వచ్చారు. కానైతే ఆ వివరాలు మాత్రం తాశీల్దారుగారి వీనులు దాకా వెళ్ళీ వెళ్ళకమునుపే గాలిలో కలిసిపోయాయి.
ఎండలో నడచి వచ్చి మధ్యాహ్నం పూట స్కూల్లో తూగుతూ కూర్చున్న కుర్రాణ్ణి, పంతులుగారు పాఠశాలావరణ చుట్టూ పదిసార్లు పరుగెత్తమని చెబితే, ఆ కుర్రాడెలా పరుగెడుతాడో సరిగ్గా తాశీల్దారుగారు అలాగే పొలాలవెంట తిరగసాగారు.
ప్రొద్దుపోయింది. సందెచీకట్లు క్రమక్రమంగా దట్టమౌతున్నాయి. నడుస్తూ నడుస్తూ వున్న తాశీల్దారుగారు వున్నట్టుండి ఆగి, చెరువు మరక దగ్గర కోడెలకు నీళ్లు దాపిస్తున్న ముసలాతణ్ణి కొంతసేపు పరకాయించి చూచి మునసబుతో "అతడి నిలా పిలువు" అన్నారు.
"ఒరే నారాయుడూ!" ఇలారా. బాబుగారు పిలుస్తున్నారు" అని మునసబు కేకవేశాడు.

"దండాలు బాబయ్యా దండాలు!" అంటూ నారాయుడు చేతులు గట్టుకుని తాశీల్దారు ముందు నిలిచాడు.

"నీ చేతిలో వున్నదేమిటీ!" అన్నారు తాశీల్దారుగారు.

"ఇదా బాబూ! మరి....మరి...."

"భయపడుతావెందుకూ! పొడుండబ్బీ కాదూ! ఏదీ" అంటూ తాశీల్దారుగారు చేయి చాచారు.

నారాయుడు డబ్బీ తాశీల్దారుగారి చేత బెట్టాడు. మూతతీసి ఒక అంగుళం పొడుగునా వ్రేళ్ళ మధ్య పొడి బిగబట్టి ఒకసారి బిగ్గరగా లోపలికి పీలుస్తూ తాశీల్దారుగారు "నీ పేరేమిటన్నావు?" అన్నారు.

"నా పేరాండీ! నారాయుడంటారు బాబయ్యా!"

"కోడె లెవరివి? నీ వేనా?" అన్నారు తాశీల్దారు గారు.

"కోడెలా బాబూ! మల్లయ్యగారి వండీ. ఆయనింట్లో సేద్యానికుంటున్నాను."

"బిడ్డలు లేరూ?"

"ఉన్నారండీ! నలుగురు మగబిడ్డలు"

తాశీల్దారు గారు కరణం వైపు తిరిగి, "ఆ నాలుగెకరాల పొలం కోసం నారాయుడు చేత అర్జీ పెట్టించు. రేపు ఉదయం నేను బయల్దేరేలోగా అర్జీ నా చేతికందాలి" అన్నారు.

మునసబు ముఖం పాలిపోయింది. కరణం ముఖం తెల్లబోయింది. నారాయుడు ముఖం విప్పారింది.

* * *